క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



దుకాణ యజమానులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: నగరంలో ప్లాస్టిక్ నిషేధంపై 20వ వార్డు శానిటేషన్ సెక్రటరీ సూరిబాబు, ఇతర సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలోని దుకాణాలలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం చేయవద్దని సూచించారు. నిషేధిక ప్లాస్టిక కవర్లను వినియోగిస్తే జరిమానా విధిస్తామని దుకాణదారులను హెచ్చరించారు.

20వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు మునిసబు వారి వీధి, కాగితాలవారి వీధిలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు రూ.19 లక్షల వ్యయంతో యూజీడీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. కార్పొరేటర్ మువ్వల లక్ష్మి కార్యక్రమంలో పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు రమాదేవి, మద్ది పోలిరెడ్డి, పండరీబాయి, మువ్వల సురేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్ మరియు ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ జిల్లా ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్. వి.పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా రుణఅవకాశం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90596 65146, 80087 15357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రైస్తవ శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాలస్వామి తదితరులు

మహారాణిపేట : క్రిస్టియన్ శ్మశాన వాటికకు 10 ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ విభాగం క్రిస్టియన్ ఎఫైర్స్ సలహాదారు డాక్టర్ ఎం.బాలస్వామి కలెక్టర్ మల్లికార్జునకు విజ్ఞప్తి చేశారు. గురువారం క్రైస్తవ సంఘాల నాయకులతో పాటు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. క్రైస్తవులు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ క్రిస్టియన్ లీడర్స్ ఫోరమ్ చైర్మన్ ఆలీవర్‌రాయి, ఏఈఎల్‌సీ ప్రతినిధి రెవరెండ్ జేమ్స్ శ్రీకాంత్, విశాఖ సిమెట్రీ బోర్డ్ కార్యదర్శి జి. మాథ్యూపీటర్, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ ప్రతినిధి పి. ఇమ్మానుయేల్ ఉన్నారు.

జాలరిపేటకు.. కొత్తరూపు



జాలరిపేటలోని టిడ్కో ఆదర్శగ్రామం



పరిశుభ్రంగా ఉన్న జాలరిపేట కాలనీ రోడ్డు



సర్వాంగ సుందరంగా రామాలయం కూడలి

- సీసీ రోడ్ల నిర్మాణంతో మారిన రూపురేఖలు
- ఆకర్షణీయంగా టిడ్కో ఆదర్శ గ్రామం
- త్వరలో అందుబాటులోకి యూజీడీ వ్యవస్థ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ చేపట్టిన అభివృద్ధి పనులతో పెదజాలరిపేట ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు గుంతల రోడ్లు, చెత్తా చెదారాలతో కనిపించే ఈ మత్స్యకార కాలనీ ఇప్పుడు అత్యంత ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది. కాలనీ మొత్తం ఒకేసారి సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణం పూర్తి కావడంతో ఎటు వైపు చూసినా పరిశుభ్రతతో కనువిందు చేస్తున్నాయి. 2018లో జీవీఎంసీ జాలరిపేట అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ అప్పట్లో పనులు కార్యరూపం దాల్చలేదు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా రూ.35 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమైనా పనులు జరగలేదు. అయితే జీవీఎంసీ ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి హామీ మేరకు రోడ్లు, యూజీడీ పనులకు జీవీఎంసీ నాంది పలికింది. అలాగే జాలరిపేటలో నిర్మించిన టిడ్కో ఆదర్శగ్రామం అందరినీ ఆకర్షిస్తోంది.

రూ.35 కోట్లుతో అభివృద్ధి పనులు:

జాలరిపేటలో 8 నుంచి 10 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో జీవీఎంసీ రూ.35 కోట్లతో యూజీడీ, రోడ్లు నిర్మాణ పనులు చేపట్టింది. ఈ ప్రాజెక్టు ద్వారా 9 కిలోమీటర్ల పరిధిలో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, యూజీడీ నిర్మించారు. 5 వేల ఇళ్లను యూజీడీ కనెక్షన్ పరిధిలోకి తెచ్చారు. తొలుత 2020 నాటికి ఈ పనులు పూర్తిచేయాలని జీవీఎంసీ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కోవిడ్ కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం యూజీడీ కనెక్షన్ల పనులు పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రీసైక్లింగ్ పంప్‌హౌస్ 2వ దఫా పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన అనంతరం యూజీడీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఆకర్షణీయంగా ఆదర్శగ్రామం

పెదవాల్తేర్ జాలరిపేటలో ఆదర్శగ్రామం పేరిట టిడ్కో గృహాలను నిర్మించారు. 5 బ్లాకులుగా నిర్మించిన ఈ ఆదర్శగ్రామంలో 120 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు చేశారు. రూ.9 కోట్లు వ్యయంతో ఈ నిర్మాణం జరిగింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు 365 ఎస్ఎఫ్‌టీతో హాల్, కిచెన్, బెడ్ రూమ్ విత్ అటాచ్డ్ బాత్‌రూమ్‌తో అత్యంత ఆధునికంగా ఈ ఇళ్ల నిర్మాణం జరిగింది. పిల్లర్స్‌తో పాటు గోడలు సైతం పూర్తిగా కాంక్రీట్‌తో నిర్మాణం చేశారు. ఇక్కడ పూర్తి సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో యూజీడీ డ్రైన్, విద్యుత్, వాటర్ సరఫరాను ముందుగానే అందుబాటులోకి తెచ్చారు. దీంతో సకల సౌకర్యాలతో నిర్మించిన ఈ ఆదర్శగ్రామం జాలరిపేటకు నూతన శోభ తెచ్చింది.

తోటగరువు హైస్కూల్‌లో జోరుగా ప్రవేశాలు



తోటగరువు హైస్కూల్‌లో ప్రవేశాల కోసం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఆరిలోవ: స్థానిక తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికి సుమారు 200 మంది వరకు కొత్తగా ప్రవేశాలు పొందారు. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 20 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వాటితో పాటు 14 ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ ప్రాంతంలో ఇదొక్కటే ఉన్నత పాఠశాల కావడంతో ప్రతి సంవత్సరం ఇక్కడ ఎక్కువగా ప్రవేశాలు జరుగుతుంటాయి. గతేడాది సుమారు 400 మంది వరకు చేరారు. వేసవి సెలవులు ముగిసిన అనంతరం కొత్తగా విద్యార్థ్థు ఇక్కడి వచ్చి చేరుతున్నారని, వీరిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారని హెచ్‌ఎం కె.దుర్గాభవాని తెలిపారు. గతేడాది కంటే ప్రవేశాలు సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం : ఏపీఈపీడీసీఎల్ జోన్-1లోని చైతన్యనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-1 ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. చైతన్యనగర్, మద్దిలపాలెం, ఆర్టీసీ డిపో వెనక ప్రాంతం, కనకమ్మ గుడి, గాయత్రి స్కూల్, దేవి హోమ్స్, వినాయక గుడి, 60 ఫీట్ రోడ్, కేఆర్‌ఎం కాలనీ, భానునగర్, శ్మశానవాటిక ప్రాంతం, ఎంవీపీ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో తనిఖీలు



ఉపాధ్యాయులతో ఫిర్యాదుపై చర్చిస్తున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో గురువారం ఉప విద్యా శాఖాధికారి(డిప్యూటీ డీఈవో) గౌరీశంకర్ తనిఖీలు చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ రఘు ఫిర్యాదుతో ఆర్‌జేడీ ఆదేశాల మేరకు తరగతి గదులకు వెళ్లి విదార్థుల నోట్‌బుక్స్, రికార్డులు, జగనన్న విద్యా కానుక కిట్లు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడి వారికి పలు సూచనలిచ్చారు. ఉపాధ్యాయులు ఏవిధంగా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, డిజిటల్ బోర్డులు, ఆర్వో ప్లాంట్‌తోపాటు గుడ్లు, చెక్కీలు ఉంచిన గదిని, రాగి జావ నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఫిర్యాదుపై చర్చించి వివరాలు సేకరించారు. ఈ ఏడాది మార్చిలో స్కూల్ కమిటీ చైర్మన్ రఘు చేసిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు గౌరీశంకర్ తెలిపారు. హెచ్‌ఎం పని తీరుపై లేఖ రాయాలని సూచించారు. కమిటీ మెంబర్ ఇందిరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



కుమార్ పాత్రా

ఎంవీపీ కాలనీ: కేఆర్‌ఎం కాలనీకి చెందిన కుమార్ పాత్రో(74) అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. కుమార్ పాత్రా కేఆర్‌ఎం కాలనీలో నివాసముంటున్నాడు. ఈనెల 19వ తేదీ నుంచి ఆయన కనిపించడం లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం లేకుండాపోయింది. కుమార్ పాత్రా అన్న కుమార్తె ఎస్‌కే బేగం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అవ్వాతాతలకు కంటి వెలుగు

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు నేత్ర పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ





వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధ పడుతున్న ఎంతో మంది వృద్ధులకు వెలుగు ప్రసాదిస్తోంది.

మహారాణిపేట : డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుంది. శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 సంవత్సరాలు పైబడిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లద్దాలు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి కేటరాక్టు శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3394 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.

మూడు విడతల్లో వృద్ధులకు పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వా-తాతలకు కళ్ల జోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

– డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తున్నాం..



కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం చేస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరం అయితే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. అలాగే కేటరాక్టు ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ విశ్వమిత్ర, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనక రాజీవ్‌నగర్ కాలనీలో తలపెట్టిన సామాజిక భవన నిర్మాణానికి గురువారం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ ఇక్కడ ప్రజల అవసరం కోసం రూ.38 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవనం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ ఏఈ అప్పాజీ, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, పి.బాలరాజు, ముద్దాడ పాపారావు, హుస్సేన్, సుజాత, మోహన్, అర్జున్, శ్రీను, కనకరాజు, రాజులమ్మ పాల్గొన్నారు.

డిగ్రీ సర్టిఫికెట్ల పరిశీలనకు నేడు గడువు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగియనుంది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. మరిన్ని వివరాలకు 63058 72717 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏయూ సమాచారమ్

అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగం ఆచార్యుడు పి.త్రినాథరావు ఇండోనేషియాలోని జకార్తాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా 71 మంది పరిశోధన పత్రాలు సదస్సుకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా త్రినాథరావును ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తన కార్యాలయంలో అభినందించారు.

వర్సిటీని సందర్శించిన ఇరాక్ దేశస్తులు



ఇరాక్ దేశస్తులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇరాక్ దేశ విద్యా మంత్రిత్వ శాఖ ఇంగ్లిష్ లాంగ్వేజ్ కరికులం విభాగాధిపతి, ఏయూ పూర్వ విద్యార్థిని హింద్ ఫరూక్ ఆలీ గురువారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీలో అభివృద్ధి జరుగుతున్న తీరు తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున ఫరూక్ ఆలీని వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆహార ఫలహారశాల ప్రారంభం



ఫలహారశాలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని స్వీకరించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన ఫలహార శాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సిరిధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలిచే సిరిధాన్యాలను ఉపయోగిస్తూ విభిన్న ఆహార పదార్థాల తయారీ చేస్తూ, విక్రయించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో ఆరోగ్యం, ఆహారంపై అవగాహన పెంపొందించడానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ తులసీరావు, వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.వి జయలక్ష్మి అవినాష్ సంస్థ నిర్వాహకులు ప్రజ్ఞానంద్, సాయిపద్మ, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి



డీడీ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న విదసం ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు

ఎంవీపీ కాలనీ: ప్రభుత్వ బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని బాలికల వసతి గృహాల్లో మరింత భద్రత పెంచాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లాలో ఉన్న పలు సాంఘిక సంక్షేమ శాఖ స్థలాలకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విదసం ప్రతినిధులు హరిబాబు, సుజాత, నిర్మల, కస్తూరి వెంకటరావు, బల్ల కుమార్, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ఏడీ పాల్

ఎంవీపీ కాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాలలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గ నిర్దేశంతో కళాశాల యాజమాన్యం గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) ఏయూ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ఏడీ పాల్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులంతా కమ్యూనిటీ సర్వీస్‌ను బాధ్యతగా తీసుకోవాలన్నారు. నిబద్ధతతో ఈ ప్రాజెక్టును నిర్వహించి, సమాజ అభివృద్ధిలో భాగస్వామిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరీశునికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేష హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

కనులపండువగా కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ పరిశీలన

మహారాణిపేట : డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు గురువారం పెందుర్తి సీహెచ్‌సీ పరిధిలో గల వాలిమెరక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సి బ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం పెందుర్తి సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి తగిన సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్.రమారెడ్డి తదితరులు పాల్గొన్నా రు.